క్లుప్తంగా

వేలంలో రూ.23వేల ఆదాయం



వేలం పాట నిర్వహిస్తున్న అధికారులు

డోన్ టౌన్: జిల్లా ప్రోహిబిషన్, ఎక్సైజ్ శాఖ అధికారుల ఆదేశాల మేరకు శనివారం డోన్ ఎక్సైజ్ స్టేషన్ ఆవరణలో వివిధ ఎక్సైజ్ నేరాల్లో పట్టుబడిన ఆరు ద్విచక్ర వాహనాలను వేలం ద్వారా విక్రయించారు. ఈ వేలం ద్వారా రూ.20 వేల ఆదాయం లభించగా, అదనంగా జీఎస్టీ రూ.3,600 వసూలు చేసి మొత్తం రూ.23,600 ఆదాయం వచ్చినట్లు ఎక్సైజ్ సీఐ లక్ష్మణదాసు, ఎస్ఐ సోమశేఖరరావు తెలిపారు.

వెండి తీర్థపు గిన్నె విరాళం



తీర్థపు గిన్నె అందజేస్తున్న దాతలు

బనగానపల్లె: మండలంలోని యాగంటి ఉమా మహేశ్వరస్వామి దేవస్థానానికి వైఎస్సార్ జిల్లా బద్వేల్‌కు చెందిన దాతలు పొన్నవోలు గోవర్ధన్‌రెడ్డి, సాహిత్యరెడ్డి శనివారం రూ.45 వేల విలువ చేసే 240 గ్రాముల వెండి తీర్థపు గిన్నె మరియు ఉద్ధరిణను విరాళంగా అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ అధికారులు, పూజారులు ప్రత్యేక పూజలు చేయించి దాతలకు తీర్థప్రసాదాలు అందజేశారు.

విద్యార్థుల సామర్థ్యాలను వెలికితీయాలి



విద్యార్థినుల సామర్థ్యాలను పరీక్షిస్తున్న డైట్ లెక్చరర్

ప్యాపిలి: విద్యార్థుల సామర్థ్యాలను ఉపాధ్యాయులు వెలికితీయాలని మండల అబ్జర్వర్, డైట్ లెక్చరర్ రాముడు అన్నారు. స్థానిక కిందిగేరి ప్రాథమిక పాఠశాలను ఎంఈఓలు మహేశ్వర్ రెడ్డి, వెంకటేశ్ నాయక్‌తో కలిసి శనివారం తనిఖీ చేశారు. తరగతుల వారీగా విద్యార్థుల సామర్థ్యాలను పరీక్షించారు. ఉపాధ్యాయుల హ్యాండ్ బుక్స్, అసెస్మెంట్ బుక్లెట్స్, విద్యార్థుల హాజరు పుస్తకాలను పరిశీలించారు. మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఉపాధ్యాయులు విద్యార్థుల ప్రగతిని ప్రతి రోజూ పరిశీలించాలని సూచించారు. వారి వెంట హెచ్ఎం సరళాదేవి తదితరులు ఉన్నారు.


ఉద్యోగులకు ఐఆర్ ప్రకటించాలి



మాట్లాడుతున్న యూటీఎఫ్ మండల అధ్యక్షుడు ప్రతాప్

బనగానపల్లె రూరల్: ఉద్యోగులకు దీపావళి కానుకగా రాష్ట్ర ప్రభుత్వం ఐఆర్ ప్రకటించాలని యూటీఎఫ్ జిల్లా సహాధ్యక్షుడు సత్యప్రకాష్, మండల అధ్యక్షుడు ప్రతాప్ డిమాండ్ చేశారు. శనివారం స్థానిక యూటీఎఫ్ కార్యాలయంలో వారు మాట్లాడారు. ఉద్యోగ, ఉపాధ్యాయుల బకాయిలను విడుదల చేయాలని, పీఆర్‌సీని నియమించాలని, అంతవరకు ఐఆర్ ప్రకటించాలన్నారు. సమావేశంలో సంఘం నాయకులు విజయకుమార్, సుధాకర్, కృష్ణయ్య, గోపాల్, నాగరాజు, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

ద్విచక్రవాహనాలు ధ్వంసం



ధ్వంసమైన స్కూటీ హెడ్‌లైట్

డోన్ టౌన్: పట్టణంలో ఇళ్ల ముందు పార్కు చేసిన బైక్‌లనే లక్ష్యంగా చేసుకుని రాత్రి వేళల్లో గుర్తు తెలియని వ్యక్తులు ధ్వంసం చేస్తున్నారు. శుక్రవారం రాత్రి శ్రీరామనగర్‌లో నాలుగు బైక్‌ల హెడ్ లైట్స్, సైడ్ డూమ్‌లను దుండగులు ధ్వంసం చేసినట్లు స్థానికులు తెలిపారు. శ్రీనివాసనగర్‌లోనూ ఇలాంటి ఘటన చోటు చేసుకున్నట్లు కాలనీవాసులు వాపోయారు. ఈ ఘటనలపై పట్టణ పోలీసులను వివరణ కోరగా తమకు ఇప్పటి వరకు ఎలాంటి ఫిర్యాదులు అందలేదని సమాధానం ఇచ్చారు.

ఏడి 'పింఛన్'

- కూటమి ప్రభుత్వంలో కొత్త పింఛన్లు ఎప్పుడో?
- ఊసేలేని 50 ఏళ్లకే పింఛన్
- తెరుచుకోని వెబ్‌సైట్
- ఆశగా ఎదురు చూస్తున్న అర్హులు

ప్యాపిలి: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే బీసీ డిక్లరేషన్ కింద బీసీ, ఎస్సీ, ఎస్టీలకు 50 ఏళ్లకే పింఛన్లు అందజేస్తామని ఎన్నికల ప్రచార సభల్లో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రతిపక్ష హోదాలో ఊదరగొట్టారు. 50 ఏళ్లకే పింఛన్ ఇస్తామని మేనిఫెస్టోలో సైతం పొందుపర్చారు. తీరా అధికారంలోకి వచ్చిన తర్వాత తమ నిజస్వరూపాన్ని బయటపెట్టారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాదిన్నర అవుతోంది. అయినా ఇప్పటి వరకు 50 ఏళ్లకే పింఛన్ గురించి ప్రభుత్వం ఊసెత్తడం లేదు. దీంతో 50 సంవత్సరాలు పైబడిన వారు పింఛన్ కోసం ఆశగా ఎదురు చూస్తున్నారు. గత కొద్ది నెలలుగా అనర్హుల తొలగింపు పేరిట భారీగా పింఛన్లు తొలగించేందుకు ప్రభుత్వం కుట్ర పన్నుతోంది. ఇందులో భాగంగా గత ఆగస్టు నెలలో వైకల్య శాతం తక్కువగా ఉందన్న సాకుతో వందలాది మంది దివ్యాంగులకు ప్రభుత్వం నోటీసులు పంపించింది. అయితే దీనిపై తీవ్ర వ్యతిరేకత ఎదురవడంతో తాత్కాలికంగా ఈ చర్యలను నిలిపివేసింది. ఎప్పటికైనా ప్రభుత్వం పింఛన్లు తొలగిస్తుందన్న భయం లబ్ధిదారుల్లో నెలకొంది.



కూటమి మేనిఫెస్టోలో బీసీ డిక్లరేషన్ కింద 50 ఏళ్లకే రూ. 4 వేలు పింఛన్ ఇస్తామన్న హామీ

కొత్త పింఛన్ల కోసం కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు

కాగా 60 సంవత్సరాలు పైబడిన వృద్ధులు కొత్త పింఛన్ కోసం ఎప్పటి నుంచి దరఖాస్తు చేసుకోవాలో తెలియక ఆందోళనకు గురవుతున్నారు. గత వైఎస్సార్‌సీపీ హయాంలో పింఛన్ల దరఖాస్తు నిరంతర ప్రక్రియగా సాగింది. సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు అర్హులకు అందుబాటులో ఉంటూ కొత్త పింఛన్ల కోసం దరఖాస్తు చేసేవారు. దరఖాస్తు చేసుకున్న మరుసటి నెల నుంచే పింఛన్లు మంజూరయ్యేవి. ప్రస్తుతం పరిస్థితి అందుకు పూర్తిగా భిన్నంగా ఉంది. 2024 సార్వత్రిక ఎన్నికల కోడ్ కారణంగా ఆగిన వెబ్‌సైట్ ఇప్పటికీ తెరుచుకోలేదు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఎన్టీఆర్ భరోసా పింఛన్‌గా పేరుమార్చి పింఛన్ మొత్తాన్ని పెంచడం తప్ప చేసింది శూన్యం. దీంతో వృద్ధాప్య పింఛన్‌కు అర్హత ఉన్న వారంతా సచివాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. వారికి సమాధానం చెప్పలేక సచివాలయ సిబ్బంది ఇబ్బంది పడుతున్నారు. నియోజకవర్గంలోని డోన్, ప్యాపిలి, బేతంచెర్ల మండలాల్లో 50 ఏళ్లు పైబడిన వృద్ధులు 27 వేల మంది ఉంటారని అంచనా.

ప్రభుత్వం నుంచి ఆదేశాలు రాలేదు



కొత్తగా పింఛన్లు దరఖాస్తు చేసుకునే విషయమై ప్రభుత్వం నుంచి ఆదేశాలు రాలేదు. వృద్ధాప్య పింఛన్ తీసుకుంటున్న వృద్ధుడు మరణిస్తే ఆయన స్థానంలో అతని భార్యకు పింఛన్ మంజూరు అవుతోంది. ఇది కాకుండా వృద్ధాప్య, వితంతు, దివ్యాంగ పింఛన్లు కొత్తగా దరఖాస్తు చేసుకునేందుకు అవకాశం లేదు. ప్రభుత్వం నుంచి ఆదేశాలు వచ్చిన వెంటనే చర్యలు తీసుకుంటాం.

–శ్రీనివాసరావు, ఎంపీడీఓ

పింఛన్ కోసం ఎదురు చూస్తున్నాను



నా వయసు 60 ఏళ్లు. పింఛన్ కోసం సచివాలయానికి వెళ్లి అడిగితే ఇంకా వెబ్‌సైట్ తెరుచుకోలేదు అన్నారు. నెలకు రూ.4 వేలు పింఛన్ వస్తే మందులు, ఇతర ఖర్చులకు ఆసరాగా ఉంటుంది. ప్రభుత్వం 60 సంవత్సరాలు దాటిన అందరికీ పింఛన్ కోసం దరఖాస్తు చేసుకునే అవకాశం కల్పించాలి. సైట్ తెరుచుకుంటే దరఖాస్తు చేసుకోవచ్చని ప్రతి రోజూ సచివాలయం దగ్గరకు వెళ్లి వస్తున్నాను.

–చంద్రప్ప, మామిళ్లపల్లె, ప్యాపిలి

50 ఏళ్లకే పింఛన్ ఇస్తామన్నారు



50 ఏళ్లు దాటిన వారికి పింఛన్ ఇస్తామని ఎన్నికల్లో కూటమి నాయకులు హామీ ఇచ్చారు. ప్రభుత్వం ఏర్పడి ఏడాదిన్నర కాలం పూర్తయింది. ఇప్పటి వరకు 50 ఏళ్ల పింఛన్ గురించి ఏం చెప్పలేదు. అధికారులను అడిగితే మాకు ఇంకా ప్రభుత్వం నుంచి ఆదేశాలు రాలేదని చెబుతున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం 50 సంవత్సరాలు దాటిన వారికి పింఛన్లు మంజూరు చేయాలి.

–రామచంద్ర, మామిళ్లపల్లె, ప్యాపిలి

వివాహిత అదృశ్యం

కోవెలకుంట్ల: పట్టణంలోని స్వామినగర్ కాలనీకి చెందిన వివాహిత అదృశ్యమైనట్లు ఎస్ఐ మల్లికార్జునరెడ్డి తెలిపారు. ఎస్ఐ సమాచారం మేరకు.. స్వామినగర్ కాలనీకి చెందిన మహిళ తన ఇద్దరు పిల్లలతో కలిసి రెండు రోజుల క్రితం బయటకు వెళ్లి తిరిగి ఇంటికి రాలేదు. బంధువులు, ఇతర ప్రాంతాల్లో గాలించినా ఆచూకీ లభ్యం కాకపోవడంతో ఆమె భర్త నరసింహా పోలీసులను ఆశ్రయించాడు. ఈ మేరకు శనివారం అదృశ్యం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

కంప్యూటర్ కోర్సుల్లో ఉచిత శిక్షణ

డోన్ టౌన్: ఉన్నతి ఫౌండేషన్ సంస్థ నిరుద్యోగులకు బెంగళూరులో కంప్యూటర్, ట్యాలీ కోర్సుల్లో 35 రోజుల పాటు ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు ఆ సంస్థ ఆడ్మిషన్స్ కో–ఆర్డినేటర్ హరిప్రసాద్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. శిక్షణ కాలంలో భోజనం, వసతి సౌకర్యంతో పాటు ఉద్యోగావకాలు కూడా కల్పిస్తామని పేర్కొన్నారు. 18 నుంచి 28 ఏళ్ల వయసు, కనీసం 10వ తరగతి అపై చదివిన వారు అర్హులన్నారు. ఆసక్తి కలిగిన అభ్యర్థులు 90004 87423 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు. ఈ అవకాశాన్ని నిరుద్యోగులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.



పూజల్లో పాల్గొన్న కాటసాని రాంభూపాల్‌రెడ్డి, కాటసాని రామిరెడ్డి, తదితరులు

ఘనంగా విగ్రహాల ప్రతిష్ట

అవుకు(కొలిమిగుండ్ల): మండల పరిధిలోని నిచ్చెనమెట్లలో సీతారామ లక్ష్మణ, అభయాంజనేయ స్వామి విగ్రహాల ప్రతిష్ట ఘనంగా జరిగింది. మూడు రోజుల పాటు వేదపండితుల బృందం ప్రత్యేక పూజలు, హోమాలు నిర్వహించిన అనంతరం శనివారం అశేష భక్తుల నడుమ విగ్రహాలను శాస్త్రోక్తంగా ప్రతిష్ఠించారు. వైఎస్సార్‌సీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు కాటసాని రాంభూపాల్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి, పార్టీ నాయకులు కాటసాని ప్రసాదరెడ్డి, కాటసాని తిరుపాల్‌రెడ్డి, గుండ్లశింగవరం సర్పంచ్ కాటసాని రమాకాంత్‌రెడ్డి ప్రత్యేక పూజలు చేశారు. భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఉమ్మడి జిల్లా ఎంపీటీసీల సంఘం అధ్యక్షుడు గోపవరం గోపాల్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి అంబటి రవికుమార్ రెడ్డి, నాయకులు జిల్లెళ్ల శంకర్‌రెడ్డి, చెన్నప్ప, వెంకటేశ్వర్లు, వెంకటరాముడు, మోహన్‌రెడ్డి, రామచంద్రా రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాల ఏర్పాటుకు వినతి

బనగానపల్లె రూరల్: మొక్కజొన్న పంట కొనుగోలు కేంద్రాలను తక్షణమే ఏర్పాటు చేయాలని ఏపీ రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు సుబ్బరాయుడు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం తహసీల్దార్ కార్యాలయం వద్ద సీనియర్ అసిస్టెంట్ శేషాద్రికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ.. మండలంలో సుమారు 65 వేల ఎకరాల్లో సాగు భూమి ఉండగా, 15 వేల ఎకరాల్లో మొక్కజొన్న పంట సాగు జరిగిందన్నారు. అకాల వర్షాలతో పంట దెబ్బతినగా, ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలు లేక రైతులు తక్కువ ధరకే ప్రైవేట్ వ్యాపారులకు పంటను విక్రయించే పరిస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేశారు. అలాగే దద్దణాల ప్రాజెక్టు ద్వారా నీటి పంపింగ్, చెరువుల పునరుద్ధరణ, ఆయకట్టు అభివృద్ధి వంటి డిమాండ్లను కూడా వినతిపత్రంలో చేర్చినట్టు తెలిపారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు సుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఏపీ రైతు సంఘం నాయకులు

సోలార్ విద్యుత్‌తో డబ్బులు ఆదా



సమావేశంలో మాట్లాడుతున్న అధికారులు



మాట్లాడుతున్న విద్యుత్‌శాఖ ఏడీఈ మద్దిలేటి

డోన్ టౌన్: ఇంటిపై సోలార్ ప్యానెళ్లు ఏర్పాటు చేసుకుంటే విద్యుత్ బిల్లును ఆదా చేయవచ్చని, మిగులు విద్యుత్‌ను విక్రయించడం ద్వారా ఆదాయం పొందవచ్చని ఆ శాఖ ఈఈ కమలాకర్‌రావు అన్నారు. స్థానిక కార్యాలయంలో శనివారం సోలార్ విద్యుత్ ఉత్పాదన, ప్రభుత్వ సబ్సిడీపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సోలార్ వినియోగాన్ని పెంచి పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలని కోరారు. అలాగే 10 ఎకరాలు ఉన్న వారు స్థలాన్ని అద్దెకిస్తే సోలార్ ప్లాంట్ నిర్మిస్తామని..తద్వారా నిరంతర ఆదాయం వస్తుందన్నారు. సమావేశంలో విద్యుత్‌శాఖ డీఈఈ నాగేంద్ర, ఏఈ నాగేశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సద్వినియోగం చేసుకోవాలి

బనగానపల్లె రూరల్: కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న సోలర్ సబ్సిడీ పథకాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని విద్యుత్‌శాఖ ఏడీఈ మద్దిలేటి సూచించారు. శనివారం పొదుపు భవనంలో పీఎం సూర్యఘర్ ముఫ్త్ బిజ్లీ యోజనపై అవగాహన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఏడీఈ మాట్లాడుతూ.. సోలర్ వినియోగం ద్వారా విద్యుత్ బిల్లులు తగ్గడమే కాక పర్యావరణ కాలుష్యాన్ని కూడా నివారించవచ్చని అన్నారు. సోలర్‌పై జీఎస్టీ 12 శాతం నుంచి 5 శాతానికి తగ్గించడమే కాక, ఎస్సీ, ఎస్టీలకు వందశాతం, ఇతరులకు రూ.78 వేల వరకు సబ్సిడీ ఇస్తున్నట్టు వివరించారు. ఏఈ శ్రీనివాసులు, ఎంపీడీఓ బాలాంజనేయులు, గ్రామ పంచాయతీ ఈఓ సతీష్‌కుమార్‌రెడ్డి పాల్గొన్నారు.

సూపర్ జీఎస్టీతో తగ్గిన ధరలు

డోన్ టౌన్: కేంద్ర ప్రభుత్వం ఇటీవల తీసుకొచ్చిన సూపర్ జీఎస్టీతో రవాణా రంగం పుంజుకుంటుందని డోన్ మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ క్రాంతికుమార్, నంద్యాల జిల్లా గూడ్స్ అండ్ సర్వీసు టాక్స్ సర్కిల్–2 ఆఫీసర్ లక్ష్మణ్‌నాయక్ అన్నారు. స్థానిక కార్యాలయంలో శనివారం సూపర్ జీఎస్టీ– సూపర్ సేవింగ్స్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. నూతన జీఎస్టీతో ద్విచక్ర వాహనాలు, మూడు చక్రాలు, నాలుగు చక్రాల వాహనాల రేట్లు తగ్గాయని తెలిపారు. 350సీసీ బైక్‌లపై 28 శాతం నుంచి 18 శాతం, ట్రాక్టర్లపై 12 నుంచి 5 శాతం జీఎస్టీ తగ్గించినట్లు చెప్పారు. చిన్నకార్లు, ఎలక్ట్రిక్ వాహనాల ధరలు సైతం తగ్గినట్లు పేర్కొన్నారు. అనంతరం పట్టణంలో యువతతో బైక్ ర్యాలీ నిర్వహించారు.



అవగాహన ర్యాలీలో అధికారులు

శుభకార్యం

బనగానపల్లె: నందవరంలోని తోగట వీరక్షత్రియ ధర్మవరం సత్రంలో శనివారం ఇదే గ్రామానికి చెందిన వీఆర్వో షరీఫ్ కుమారుడి వివాహం జరిగింది. మాజీ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు కాటసాని ప్రసాదరెడ్డి, కాటసాని తిరుపాల్ రెడ్డి హాజరై వధూవరులను ఆశీర్వదించారు.

22న కోవెలకుంట్లలో రచ్చబండ

కోవెలకుంట్ల: రాష్ట్రంలోని మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నిర్వహించ తలపెట్టిన రచ్చబండ, కోటి సంతకాల సేకరణ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆ పార్టీ జిల్లా ప్రచార కార్యదర్శి సిద్ధం రెడ్డి రాంమోహన్‌రెడ్డి తెలిపారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. కోవెలకుంట్ల పట్టణంలో ఈ నెల 22వ తేదీ బనగానపల్లె మాజీ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి అధ్యక్షతన కార్యక్రమం జరుగుతుందన్నారు. పార్టీ నియోజకవర్గ పరిశీలకుడు భూమా కిషోర్‌రెడ్డి, పార్లమెంట్ నియోజకవర్గాల పరిశీలకుడు కర్రా హర్షవర్ధన్‌రెడ్డి, తదితర ప్రముఖులు హాజరవుతారని తెలిపారు. మండలంలోని పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, అనుబంధ విభాగాల కన్వీనర్లు, సభ్యులు, కార్యకర్తలు తరలివచ్చి జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

డోన్ టౌన్: పట్టణంలోని కేవీఎస్ కాలనీ పరిసరాల్లో ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల ఎత్తు పెంపు పనుల కారణంగా ఆదివారం ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఏఈ నాగేశ్వరరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. కేవీఎస్ కాలనీతో పాటు శ్రీనిధి హోటల్ పరిసర ప్రాంతాల్లో తాత్కాలికంగా విద్యుత్ అంతరాయం ఉంటుందని, వినియోగదారులు సహకరించాలని సూచించారు.

పేకాటరాయుళ్ల అరెస్ట్

కోవెలకుంట్ల: మండలంలోని అమడాలలో శనివారం పేకాట ఆడుతున్న వ్యక్తులను అరెస్ట్ చేసినట్లు ఎస్ఐ మల్లికార్జునరెడ్డి తెలిపారు. గ్రామ శివారులోని ముళ్లపొదల్లో 11 మంది పేకాట ఆడుతున్నట్లు సమాచారం అందడంతో దాడి చేశామన్నారు. జూదరుల నుంచి రూ.9,500 నగదు, పేకముక్కలు స్వాధీనం చేసుకుని పేకాటరాయుళ్లను అదుపులోకి తీసుకున్నట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

బాలికలు అన్ని రంగాల్లో రాణించాలి

కొలిమిగుండ్ల: బాలికలు అన్ని రంగాల్లో రాణించేందుకు కృషి చేయాలని బాలల సంరక్షణ అధికారులు శ్రీనివాస్, దర్గయ్య సూచించారు. అంతర్జాతీయ బాలికా దినోత్సవాన్ని పురస్కరించుకుని స్థానిక కస్తూర్బా పాఠశాలలో విద్యార్థినులతో సమావేశం నిర్వహించారు. బాల్య వివాహాలు చేసుకోవడం వల్ల అనర్థాలు చోటు చేసుకుంటాయన్నారు. ఉన్నత విద్య అభ్యసించి సమాజంలో గుర్తింపు పొందాలన్నారు. సమాజంలో ఎదురయ్యే సమస్యలను సమయస్ఫూర్తితో ఎదుర్కోవాలని తెలిపారు. సైబర్‌నేరాలపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో ఎంఈఓ అబ్దుల్‌కలాం, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రమాదేవి పాల్గొన్నారు.

అక్రమ వసూళ్లు చేసినందునే పాత కమిటీ రద్దు

ప్యాపిలి: పట్టణంలో నీలకంఠేశ్వరస్వామి దేవస్థానం కల్యాణ మండప నిర్మాణం పేరిట కాలయాపన చేయడంతో పాటు అక్రమ వసూళ్లకు పాల్పడినట్లు తమ దృష్టికి రావడంతో పాత కమిటీని రద్దు చేసినట్లు ఏపీ కుర్ని సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సీబీ అజయ్ కుమార్ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. దేవస్థానం అభివృద్ధి కోసం 10 సంవత్సరాల క్రితం చాయా నరసింహులు అధ్యక్షుడిగా కుర్ని సంక్షేమ సంఘం ఏర్పాటైనట్లు పేర్కొన్నారు. అయితే పదేళ్లుగా సదరు కమిటీ దేవస్థానంలో ఎలాంటి అభివృద్ధి పనులు చేయలేదని తమ విచారణలో తేలిందన్నారు. అతనితో పాటు సదరు కమిటీని పూర్తిగా రద్దు చేసి మాసాని కుమార్‌ను అధ్యక్షుడిగా తాత్కాలికంగా కొత్త కమిటీని ఏర్పాటు చేశామన్నారు.

ఎల్ఆర్ఎస్‌కు 23 వరకు అవకాశం



లేఔట్ యజమానులకు అవగాహన కల్పిస్తున్న కమిషనర్

బేతంచెర్ల: పట్టణంలోని అనధికార లేఔట్లు, ప్లాట్ల క్రమబద్ధీకరణ కోసం ప్రభుత్వం ఎల్ఆర్ఎస్‌ను తీసుకొచ్చిందని, యజమానులు సద్వినియోగం చేసుకోవాలని నగర పంచాయతీ కమిషనర్ హరి ప్రసాద్ సూచించారు. శనివారం పట్టణంలోని నగర పంచాయతీ కార్యాలయంలో లేఔట్లు, ప్లాట్ల యజమానులకు ఎల్ఆర్ఎస్‌పై అవగాహన కల్పించారు. ఈ నెల 23వ తేదీ వరకు ల్యాడ్ రెగ్యులరైజేషన్ స్కీం (ఎల్ఆర్ఎస్)కు అవకాశం ఉందని తెలిపారు. సమావేశంలో మేనేజర్ సువర్ణ లక్ష్మి, ప్లానింగ్ సెక్రటరీ నాగ సురేష్, మల్లికార్జున పాల్గొన్నారు.

మహిళల భద్రత కోసమే శక్తి యాప్



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న సీఐ గౌతమి

ప్యాపిలి: మహిళల భద్రత కోసం ప్రభుత్వం శక్తి యాప్‌ను రూపొందించిందని బనగానపల్లె, ప్యాపిలి సీఐలు గౌతమి, వెంకటరామిరెడ్డి తెలిపారు. ప్యాపిలి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శనివారం ప్రిన్సిపాల్ సుబ్రహ్మణ్యం అధ్యక్షతన శక్తి యాప్‌పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సీఐలు మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ తమ మొబైల్‌లో శక్తి యాప్‌ను ఇన్‌స్టాల్ చేసుకోవాలని సూచించారు. అత్యవసర సమయాల్లో పోలీసుల తక్షణ సాయం కోసం యాప్‌లో ఎస్ఓఎస్ సందేశం పంపవచ్చన్నారు. యాప్‌లో ఒకే క్లిక్‌తో లేదా ఫోన్‌ను కదిలించడం ద్వారా కుటుంబ సభ్యులకు, పోలీసులు, స్నేహితులకు సందేశం వస్తుందన్నారు. జీపీఎస్ లొకేషన్‌తో పాటు 10 సెకెన్ల ఆడియో, వీడియో అందులో రికార్డయి సందేశం వస్తుందని తెలిపారు. విద్యార్థినులు, మహిళలు ఈ యాప్‌ను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎస్ఐలు మధుసూదన, మమత, ఎన్ఎస్ఎస్ పీఓ నవీనపాటి తదితరులు పాల్గొన్నారు.

ప్రణాళికతో చదివితే విజయం తథ్యం

కోవెలకుంట్ల: విద్యార్థులు ప్రణాళిక, పట్టుదలతో చదివితే విజయం తప్పక వరిస్తుందని ప్రిన్సిపాల్ వేణుగోపాల్ అన్నారు. పట్టణంలోని వాసవీ బొమ్మిడాల ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శనివారం ఫ్రెషర్స్‌డే కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ.. ఫ్రెషర్స్‌డే విద్యార్థుల మధ్య స్నేహం, అనుబంధాన్ని పెంపొందించే అహ్లాదకర సందర్భమన్నారు. సీనియర్లు జూనియర్లతో సోదరభావంతో మెలిగి వారికి అన్ని విధాల సహాయం అందించాలని సూచించారు. తదుపరి విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలతో అలరించారు. సెమిస్టర్ పరీక్షల్లో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో మార్కెట్ యార్డు చైర్మన్ కాత్రెడ్డి మల్లికార్జునరెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ వెంకటేశ్వరరెడ్డి, అధ్యాపకులు రామసుబ్బారెడ్డి, భాస్కర్‌రెడ్డి, రాజశేఖర్, కృష్ణదాసు, లక్ష్మీదేవి, అన్నపూర్ణ, నరేంద్రనాథరెడ్డి, రమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేస్తున్న ప్రిన్సిపాల్

వాహనాలపైకి దూసుకెళ్లిన తుఫాన్

- దెబ్బతిన్న మూడు వాహనాలు
- స్కూటరిస్టుకు గాయాలు

బేతంచెర్ల: మండల పరిధిలోని మద్దిలేటి నరసింహస్వామి ఆలయ సమీపంలో శనివారం తుఫాన్ వాహనం ఎదురుగా వస్తున్న మూడు వాహనాలను ఢీకొట్టింది. వివరాలు.. ఆర్ఎస్ రంగాపురం గ్రామం నుంచి ఆలయానికి వెళ్తున్న తుఫాన్ వాహనాన్ని డ్రైవర్ నిర్లక్ష్యంగా డ్రైవింగ్ చేస్తూ ఎదురుగా వస్తున్న ఆటో, కారు, బైక్‌ను ఢీకొట్టడంతో మూడు వాహనాలు దెబ్బతిన్నాయి. ఈ ప్రమాదంలో ద్విచక్రవాహనంపై ఉన్న బేతంచెర్ల బోయపేటకు చెందిన మహేంద్ర అనే యువకుడికి గాయాలయ్యాయి. మిగిలిన ఎవరికీ గాయాలు కాలేదు. కారు, ద్విచక్ర వాహనంతో పాటు తుఫాన్ వాహనం దెబ్బతింది. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించి కారణాలను తెలుసుకున్నారు.



బైక్‌ను ఢీకొని ఆగిన తుఫాన్



దెబ్బతిన్న కారు

పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత

కోవెలకుంట్ల: పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత అని, ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని తహసీల్దార్ పవన్‌కుమార్‌రెడ్డి, డిప్యూటీ ఎంపీడీఓ ప్రకాష్‌నాయుడు పిలుపునిచ్చారు. శనివారం మండలంలోని బిజనవేములలో స్వచ్ఛ ఆంధ్ర– స్వర్ణ ఆంధ్ర కార్యక్రమం నిర్వహించారు. వివిధ శాఖల మండలస్థాయి అధికారులు, గ్రామ సచివాలయ సిబ్బందితో గ్రామంలో ర్యాలీ, ప్రతిజ్ఞ చేశారు. ఎంఈఓ వెంకటసుబ్బయ్య, వెలుగు ఏపీఎం శేఖర్ పాల్గొన్నారు.

అందరూ సహకరించాలి

బేతంచెర్ల/బనగానపల్లె రూరల్/డోన్ టౌన్: అందరూ ఆరోగ్యంగా ఉండాలంటే పరిసరాల పరిశుభ్రతకు ప్రతి ఒక్కరూ సహకరించాలని ఎంపీడీఓ ఫజుల్ రహిమాన్, డిప్యూటీ తహసీల్దార్ మారుతి అన్నారు. నగర పంచాయతీ కమిషనర్ హరిప్రసాద్, వైద్య సిబ్బంది, పొదుపు మహిళలతో కలిసి బేతంచెర్ల కొత్త బస్టాండ్ వరకు సైకిల్ ర్యాలీ నిర్వహించారు. తడి–పొడి చెత్తపై ప్రజలకు అవగాహన కల్పించారు. వెటర్నరీ హాస్పిటల్ ఆవరణలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో వెటర్నరీ ఏడీ వసంత లక్ష్మి, ఎంఈఓ సోమశేఖర్ పాల్గొన్నారు. అలాగే బనగానపల్లెలో ఇన్‌చార్జ్ ఎంపీడీఓ బాలాంజనేయులు, డోన్‌లో ఎంపీడీఓ వెంకటేశ్వరరెడ్డి ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం జరిగింది.